క్లుప్తంగా

రాళ్లనంతపురంలో కార్డెన్ సెర్చ్



గడ్డివాములో సోదాలు చేస్తున్న పోలీసులు

ముదిగుబ్బ: రాళ్లనంతపురం గ్రామంలో గురువారం రూరల్ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. పాడుబడిన ఇళ్లు, గడ్డివాములు తదితర చోట్ల మారణాయుధాలు ఏమైనా దాచిపెట్టారేమోనని పరిశీలించారు.

కేసు నమోదు

ధర్మవరం అర్బన్: దాడి ఘటనలో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు..పీఆర్‌టీవీధికి చెందిన తోఫిక్, తమ్ముడు అశ్విక్ ఈనెల 12న అర్ధరాత్రి కేతిరెడ్డికాలనీలోనున్న బాక్స్ క్రికెట్ ఆడి ఇంటికి బయలుదేరారు. పీఆర్‌టీవీధిలో ఇద్దరు వ్యక్తులు వీరిని అడ్డగించి కిందపడేసి కాళ్లు, చేతులతో కొట్టి గాయపరిచారు. బాధితుడు తోఫిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా



కౌన్సిల్ సమావేశంలో ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు

పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కోరం లేక కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. ఉదయం 11గంటలకు చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన సమావేశం ప్రారంభించారు. అయితే 20 మంది కౌన్సిలర్లు, 3 కోఆప్షన్ మెంబర్లు ఉండగా అధికారులతో పాటు కేవలం తెలుగుదేశం పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. దాదాపు గంటపాటు వేచి చూసిన మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అయితే టీడీపీ కౌన్సిలర్ రత్నప్పచౌదరి నాలుగు నెలలవుతున్నా చేసిన పనులకు కూడా బిల్లులు కాలేదని, పనులు చేయడానికి కాంట్రాక్టర్లు భయపడుతున్నారంటూ చెప్పుకొచ్చారు. చివరకు కౌన్సిల్ హాజరు పట్టికను చింపేసి చైర్మన్ దిగిపోవాలంటూ హంగామా సృష్టించాడు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ



స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని జగజ్జీవన్‌రామ్ నగర్‌లోనున్న గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్‌తో విద్యార్థులకు భవిష్యత్తులో అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణనాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో వ్యక్తి అదృశ్యమయ్యాడు. వివరాలు.. గ్రామానికి చెందిన రవిచంద్ర ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. గురువారం బాధితుడి భార్య మహేశ్వరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పిల్లల సర్వే పర్యవేక్షణ



పిల్లల సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దేవరాజు

పుట్టపర్తి: బుక్కపట్నంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను గురువారం ఆ శాఖ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దేవరాజు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తిరిగి సర్వే నిర్వహించాలన్నారు. అలాగే ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి సంబంధిత పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు సదరం స్లాట్ నమోదు చేయించి వారికి సర్టిఫికెట్ వచ్చేందుకు కృషి చేయాలన్నారు. చిన్నారులు భవిత కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు అరుణ, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎస్సీకాలనీలో సమస్యల తిష్ట

- స్థానికులకు తప్పని అవస్థలు
- ఒక్కవర్షానికే ఇళ్లల్లోకి చేరిన నీరు



సంజీవపురం ఎస్సీ కాలనీలోకి వెళ్లేదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

బత్తలపల్లి: సంజీవపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఇరవై ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో సుమారు 500 మంది పైబడి ప్రజలు నివసిస్తున్నారు. కానీ నేటికీ సరైనరోడ్లు, డ్రైనేజీలు లేవు. దీంతో కాలనీవాసులు అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. దీంతో వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి.

కాటమయ్య కొండ నీరంతా కాలనీలోకే..

కాటమయ్య కొండ మీద నుంచి వచ్చే నీరు కూడా కాలనీలోకి చేరుతోంది. గతంలో అయితే నీరు కిందకు వెళ్లిపోయేదని, అనంతపురం–కదిరి జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు ఎత్తు పెరగడంతో నీరు ముందుకు సాగక కాలనీలోనే నిల్వ ఉంటోంది. ఈ విధంగా రోజుల తరబడి నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులకు వెంటనే స్పందించి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పలువురి ఇళ్లల్లోకి నీరు చేరి నిత్యవసర వస్తువులు, ఇతరత్రా వస్తువులు తడిసిపోయినట్లు వాపోయారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

మా కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో సీసీరోడ్లు నిర్మించినప్పటికీ డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

–నంద, సంజీవపురం, బత్తలపల్లి మండలం

ఇళ్ల మధ్యే మురుగునీరు

వర్షం వచ్చిందంటే చాలు ఎస్సీ కాలనీలోకి పై భాగంలోని నీరంతా వచ్చి చేరుతుంది. డ్రైనేజీలు లేక మురుగునీటితో పాటు వర్షం నీరు కలిసి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

–ఓబిలేసు, సంజీవపురం, బత్తలపల్లి మండలం

‘గ్రామస్థాయి పోరాటాలకు సిద్ధమవుదాం’



ఆర్డీటీ ఆసుపత్రి ముందు నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

బత్తలపల్లి: ఆర్డీటీ సంస్థను రక్షించుకునేందుకు గ్రామస్థాయి పోరాటాలకు సిద్ధమవుదామని అఖిలపక్ష కమిటీ(జేఏసీ) కన్వీనర్ సాకే హరి పేర్కొన్నారు. ఆర్డీటీ సంస్థకు విదేశాల నుంచి వస్తున్న నిధులను కేంద్ర ప్రభుత్వం ఆపడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి ముందు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్య, వైద్య రంగాలతోపాటు పేదల అభ్యున్నతి కోసం ఆర్డీటీ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులను ఆపడం సరికాదన్నారు. ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు తొలగిపోయేందుకు కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు చొరవతీసుకోవాలన్నారు. అఖిలపక్ష కమిటీ నాయకులు సుగమంచి శ్రీనివాసులు, సిగిలిరేవు రామాంజనేయులు, రామకృష్ణ, రాకెట్ల సూర్యనారాయణ, అసాది హరి, కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమారుడు అదృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో తల్లీకుమారుడు అదృశ్యమయ్యారు. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలు.. ఇందిరమ్మకాలనీకి చెందిన ఉమామహేశ్వరి తన నాలుగేళ్ల కుమారుడు నీరజ్ ఇద్దరు ఈనెల 11వ తేదిన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. గురువారం ఉమమహేశ్వరి తండ్రి గురుమూర్తి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని బాధితుల కోసం గాలింపు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

నేటి నుంచి గంగాభవాని మాత తిరునాల

గాండ్లపెంట: మండల కేంద్రంలోని గంగాభవాని ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. తొలిరోజు ఉదయం కలశ పూజ, అభిషేకం, తీర్థ ప్రసాదాలు వినియోగం, రాత్రి చెక్కభజన, 17న మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారి పంచలోహ విగ్రహ ఊరేగింపు, 18న తెల్లవారుజామున జ్యోతులు, బోనాల కార్యక్రమం, సాయంత్రం ఉట్ల పరుషతో తిరునాల ముగుస్తాయని వివరించారు.

భూ వివాదంపై ఘర్షణ

కొత్తచెరువు: మండల కేంద్రంలో గురువారం భూ వివాదంపై ఘర్షణ చోటు చేసుకుంది. వివరాలు.. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు మహాలక్ష్మికి మండల కేంద్రంలో ధర్మవరం వెళ్లే దారిలో స్థలం ఉంది. సదరు స్థలాన్ని అనంతపురానికి చెందిన తిరుమల రెడ్డిగారి సుశీల అనే మహిళ 2020లో కొనుగోలు చేసిశానని, స్థలాన్ని తనకు స్వాధీనం చేయించాలని ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారులు స్థలాన్ని సదరు మహిళకు స్వాధీనం చేయించారు. ఈసందర్భంగా మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు మహాలక్ష్మికి సుశీలకు మధ్య ఘర్షణ జరగడంతో పోలీసులు ఇద్దరినీ అక్కడి నుంచి పంపివేశారు.

ధర్మవరం డివిజన్‌లో 37.8 మి.మీ వర్షపాతం

ధర్మవరం అర్బన్: ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున వరకు వర్షం కురవడంతో 37.8 మిమీ వర్షపాతం నమోదైందని ఆర్డీఓ మహేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం మండలంలో 71.6 మి.మీ, బత్తలపల్లి 36.2, తాడిమర్రి 41.2, ముదిగుబ్బ 12.6, కనగానపల్లి 75.2, చెన్నేకొత్తపల్లి 16.2, రామగిరి 11.8 మి.మీ వర్షపాతం నమోదు అయిందని పేర్కొన్నారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వాగులు, వంకలు ప్రవహించి నీటి కుంటల్లోకి నీరు చేరింది. కనగానపల్లి సమీపంలోని పండమేరుతో పాటు కోనాపురం, యలకుంట్ల, తగరకుంట గ్రామాల సమీపంలోని వంకలు నీటితో ప్రవహించాయి. భారీ వర్షానికి కొన్నిచోట్ల అరటి తోటలు, మామిడి తోటలు దెబ్బ తిన్నట్లు రైతులు తెలిపారు. ఇక కనగానపల్లిలో చెరువు కట్ట మరమ్మతు పనులు చేయకపోవటంతో వర్షపు నీరంతా వృథాగా బయటకు వెళ్లిపోయిందని స్థానిక రైతులు తెలిపారు. 75.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అమ్మాయిని వేధిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అమ్మాయిని వెంటపడి వేధిస్తున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప గురువారం తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి వేముల విష్ణుప్రియ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఆమెను షామీర్ అనే వ్యక్తి వెంటపడుతూ వేధించేవాడు. షామీర్ స్నేహితులు శ్రీనాథ్, తస్లిమ్ ఇందుకు సహకరించేవారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి



సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఎస్‌హెచ్ బాషా, అయుబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం వారు ఈనెల 20న జరగబోయే దేశ వ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మిక విధానాన్ని రద్దు చేసి కార్మికులందరికి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలని, రోజుకు 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలన్నారు. 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ, బొగ్గు నాగరాజు, అనిల్, రాము, నాగవేణి, జయమ్మ, పోతలయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి: కర్ణాటక సరిహద్దులో ఉన్న కుడుమలకుంట పారిశ్రామిక ఆవరణలోని జీటీటీసీ ప్రభుత్వ డిప్లొమా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతో డిప్లొమో ఇన్ టూల్ అండ్ డై మేకింగ్, డిప్లొమో ఇన్ ప్రిసిషిన్ మ్యానుఫాక్చరింగ్, డిప్లొమో ఇన్ మెకానిక్స్ కోర్సుల్లో చేరొచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 3 సంవత్సరాల కోర్సుతో పాటు మంచి కంపెనీల్లో ఒక సంత్సరం ఇంటర్న్‌షిప్ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.18 వేల నుంచి 20 వేల వరకూ స్టైఫండ్ అందజేయడం జరుగుతుందన్నారు. కోర్సు పూర్తి అనంతరం వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. బాలబాలికలకు విడిగా తగ్గింపు ధరలతో వసతి సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7349342369 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి



నిడిమామిడిలో సూచనలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: ముందస్తు వర్షాల నేపథ్యంలో ప్రజలు అతిసారంపై అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, డీటీసీ సూపర్‌వైజర్ అబీద్‌బాషా పేర్కొన్నారు. గురువారం నిడిమామిడి, పుట్టపర్తిలోని చిత్రావతి గుట్ట ప్రాంతాల్లో అతిసారంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. వికారం, అంతులు అవడం, డీహైడ్రేషన్‌కు గురి కావడం, కాళ్లు, చేతులు లాగడం, జ్వరం, అలసట, కళ్లు తిరగడం, నోరు ఎండిపోవడం, చర్మం పొడిబారడం, తీవ్రమైన కడుపునొప్పి, పొత్తి కడుపు నొప్పి అతిసారం లక్షణాలన్నారు. ఇలాంటి వారు వెంటనే ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, టీబీ హెచ్‌వీ రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు మంజులవాణి, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు



గాయపడిన రామాంజనమ్మ

పరిగి: మండల కేంద్రంలోని నేషనల్ హైవే 544ఈఈపై గురువారం జరిగిన ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాల మేరకు.. హిందూపురం మండలంలోని శ్రీకంఠాపురానికి చెందిన రామాంజనమ్మ పని నిమిత్తం మండలంలోని పైడేటికి తన బంధువుతో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి పైడేటి సర్కిల్‌పై మడకశిర వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లైంగిక వేధింపుల కేసులో ముగ్గురికి యావజ్జీవం

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొమ్మతమరి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో అదే గ్రామానికి చెందిన వ్యక్తితోపాటు వారికి సహకరించిన ఇద్దర మహిళలకు తుమకూరు కోర్టు గురువారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కేసు వివరాలు.. దొమ్మతమరి గ్రామానికి చెందిన వెంకటేశ్, సుజాతల కుమార్తెను అతడి రెండో భార్య రత్నమ్మ, ఆమె తల్లి గంగమ్మ కుమ్మక్కై 2021 సెప్టెంబర్ 9న ఉదయం 10.30 గంటలకు ఇంట్లో చెప్పకనే నిందితులు చిరంజీవి, అరుణ్‌కుమార్‌తో కలిసి తెలంగాణలోని వరంగల్‌కు పిలుచుకెళ్లారు. అక్కడ ఓ షెడ్‌లో నివాసముండగా మైనర్ బాలికను అరుణ్‌కుమార్ లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో అరుణ్ కుమార్‌తోపాటు రత్నమ్మ, గంగమ్మలకు తుమకూరు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అరుణ్ కుమార్ కు రూ 1.5 లక్షలు, రత్నమ్మ, గంగమ్మ లకు చెరో లక్ష రూపాయాలు జరిమానా విధించింది. ఇదిలా ఉండగా ప్రధాన నిందితుడు చిరంజీవి అప్పటికే మృతి చెందాడు.

వినియోగదారుల సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్

ధర్మవరం అర్బన్: వినియోగదారుల సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని జిల్లా వినియోగదారులు సమాచార కేంద్రం అధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యదర్శి కాకుమాని రవీంద్ర, ధర్మవరం అధ్యక్షుడు పల్లెం జనార్ధన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో గురువారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వినియోగదారుల సంఘాలు ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. అన్ని మండలాల్లో వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేసి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. వినియోగదారులు మోసపోతే సంబంధిత బిల్లులతో తమకు ఫిర్యాదు చేస్తే వారికి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్

ఓడీచెరువు: వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనంతాచారి, సర్పంచ్‌లు గోవిందు, తొట్లి రంగారెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

టీ-20 టోర్నీ విజేత

అనంత రైజింగ్ స్టార్

అనంతపురం: సీనియర్ క్రికెటర్ ఎస్.చంద్రమోహన్ స్మారక క్రికెట్ సీనియర్ టీ–20 టోర్నీ విజేతగా అనంత రైజింగ్ స్టార్ నిలిచింది. గురువారం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్, కదిరి జట్లు తలపడ్డాయి. తొలుత అనంత రైజింగ్ స్టార్ బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. అనంత రైజింగ్ స్టార్ జట్టులో బి.ప్రశాంత్ 79 పరుగులు (56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు), తేజా రెడ్డి 23 బంతుల్లో 39 పరుగులు (ఆరు ఫోర్లు) ధాటిగా ఆడి జట్టుకు మంచి స్కోరు అందించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కదిరి క్యాంప్ ఏడీసీఏ జట్టు 20 ఓవర్లకు 171 పరుగులు చేసి 9 వికెట్లు నష్టపోయింది. 19 పరుగుల తేడాతో అనంత రైజింగ్ స్టార్ విజేతగా నిలిచింది. టోర్నీలో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా కేహెచ్ వీరా రెడ్డి (ఫ్యామిలీ క్లబ్), బెస్ట్ బ్యాటర్‌గా కేహెచ్ వీరారెడ్డి, బెస్ట్ బౌలర్ జి.శ్రీనివాస్ (ఫ్యామిలీ క్లబ్), బెస్ట్ వికెట్ కీపర్‌గా బి.ప్రశాంత్ (అనంత రైజింగ్ స్టార్), బెస్ట్ ఫీల్డర్‌గా అబ్దుల్లా (హిందూపురం)నిలిచారు. కార్యక్రమంలో ఏడీసీఏ జిల్లా అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్ రెడ్డి, సెక్రెటరీ వి.భీమలింగా రెడ్డి, వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్ డైరెక్టర్ సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఉత్సవాలు

మడకశిరరూరల్: చందకచెర్లు గ్రామంలోణి ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు. 21న సీతారాముల కల్యాణోత్సవం, 22న హనుమాన్ జయంతి, జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం స్వామి వారి బ్రహ్మరథోత్సవం, 23న స్వామి వారికి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి నిర్వహిస్తామన్నారు.

లక్ష్యం నీరుగారుతోంది



కట్టకిందపల్లిలో రోడ్డు పక్కన నీరు లేక వృథాగా ఉన్న తొట్టె

ధర్మవరం రూరల్: వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఒక్కొక్క తొట్టెను రూ.30 వేల వ్యయంతో ధర్మవరం మండల వ్యాప్తంగా 80 తొట్టెలు నిర్మిస్తోంది. వేసవి ప్రారంభంలో పనులు ప్రారంభించినా నేటికీ కొన్ని గ్రామాల్లో తొట్టెలు నిర్మాణ పనులు ప్రారంభమే కాలేదు. మరికొన్ని గ్రామాల్లో నిర్మించినా అందులోకి నీరు వదలలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో నీరుగారిపోతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

రహదారిపై నీరు.. తప్పని తిప్పలు



ఒంటికొండ గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా రెండు రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో భారీగా వర్షం కురిసింది. గ్రామాల సమీపంలోని చిన్న చిన్న గుంతలు వర్షపు నీటితో నిండాయి. ఒంటికొండ గ్రామంలో ప్రధాన రహదారిపై మోకాలు లోతు నీరు నిలవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు ఈ దారి నుంచే ధర్మవరం, మేడాపురం తదితర గ్రామాలకు వెళ్తారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారిపై వర్షపు నీరు నిలవడంతో అవస్థలు తప్పడం లేదు. నీరు నిల్వకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.